


భైరవభట్ల మహాలక్ష్మమ్మ

"పిల్లలు లేని కొంప రాణింపు లేదనే వాళ్లని ఏం చేసినా పాపం లేదు_వాళ్ల దుస్సలహాకి తోడు ఆ కడుపు చలవకూడా చెప్పండి_ఊ ఊ ఊ పిల్లల్ని Manufacture చేసి సందుకు తగిన శాస్తి అవుతోంది బాగానూ_ఇఖ పిల్లలంటే పిల్లలా పిశాచములాళ్లుగాని_వీళ్ల 'కీకరబాకర' తగాదాలూ వంతులాట గొడవలూ తీర్చడంతో సరి. వెనక నేనూ పిల్లనే కాబోలు. ఏమో ఎవరికి జ్ఞాపకం. ఎప్పుడు వీళ్లు పెద్దవాళ్లవుతారో, ఎప్పుడు గట్టెక్కుతారోగాని అమ్మా అమ్మా అమ్మా ప్రాణం చిట్లం కట్టి పోతోంది" అని ప్రాణం విసిగినప్పుడల్లా ఇంజను స్టీము వదిలేస్తోంటాంగాని దేవుళ్లల్లే ఏకష్టం ఎరగని పిల్లలు ఆదమఱచి రాత్రి నిద్దర్లోతోంటే వాళ్లకేసి చూచేటప్పటికి అయ్యో గుండె నీరై పోతుంది. రోజులంటే వాళ్లవే రోజులూ. ఎప్పుడు తెల్లారుతుంది. నా వరహాల మూటలు, నా వజ్రాల కొండలు, నా రత్న మాణిక్యాలు, నా భాగ్య బంగారాలు ఎప్పుడు లేస్తారు. వాళ్ళ ఆటపాటలు ఆ చిత్ర విచిత్ర లీలలు ఎప్పుడు చూతునా అని ఆశలో తెల్లారిపోతుంది. ఎప్పటికప్పుడే పరగడుపూ. అందర్లోకీ మాదుర్గి మా దిగిముండ మరీనీ—దుర్గి మా ఆరోపిల్ల కాదు ఏడోపిల్ల కాబోలు అనకూడదుగాని అది సరిగ్గా గుమ్మడికాయల్లే వుంటుంది. అందుకు తగినట్టుగా అది గుమ్మడికాయ కూరంటే చెవికోసుకుంటుంది. ఆ రోజున ఆ బిడ్డకు వంట్లో బాగుండక ఆ కూర తినవల్ల కాకపోయె. లంక గుమ్మడికాయా శనగ పప్పూ ఝూం మని పోగుపెట్టిన కూర ఘుమ ఘుమలు ఇల్లంతా కమ్మగా పిల్లలంతా భోజనాలికి సిద్ధమయ్యారు. దుర్గిని కాస్సేపు అవతల ఆడుకోమని మఱపింతా లెట్టినా. ఊఁ_కదిలింది కాదు మాయముండ-కూర చూసింది-పాపం దాని నోరు వూరుతోంది-తింటానని మారాం చేస్తుందేమో. "అబ్బే మా దుర్గి ఎంతో బుద్ధిమంతురాలమ్మా-ఈవేళ దానికి కొంచెం ఆయివొచ్చింది కాదూ-గుమ్మడికాయ కూర అదే వద్దంటుందమ్మా_ఎంత మంచి దనుకున్నారు మా దుర్గి" అని దుర్గి వినేలాగు నేను ఉబ్బలింగడు సముదాయింపులు ఎన్నిచేసినా దాని ధ్యాన్నమంతా కూరమీదే వుంది. అందరూ ఆ కూరయే ముందుగా బాజాపట్టి దానిలో మినపబద్దలు పటపట్లాడిస్తూ "అమ్మా నాకు కొంచెం కూర వెయ్యవుటే" అంటూ ఆ అన్నాలు తినడం దుర్గి చూస్తూవుండి లోపల అసూయ ఆపుకొని గుమ్మడికాయ కూర తనకు వద్దని అందరితోనూ ప్రకటనచేసి "బుద్ధిమంతురాలు" అనిపించుకోవాలీవే శెల్లాగో మఱి—ఈ వూహాల సందున దుర్గికి ఏమీ తోచక విస్తళ్ళ

ముందు నిలుచుని దీర్ఘముగా ఆలోచన మొదలెట్టి, లోపలి ఎగుపు ఆపుకొని ధైర్యము ఎగలాగుకొని నావద్దికి పరుగెత్తి వచ్చి:—

“అమ్మా, నాకు గుమ్మిడికాయ కూర— ఒద్దు” (అవునమ్మా— ఈ వేళ).

“అమ్మా, గుమ్మిడికాయకూర—నాకొద్దు” (నీకొద్దు తల్లీ, రేపు మళ్ళీ వండుకుందావే).

“గుమ్మిడికా హా య కూ హు ర హ్హాం,

నా హ్హాం కూ హ్హాం, ఒద్దు హ్హాం,

(శృతి)

గుహుంమ్మిడికాయి—కూర హో అహో—

నా కొద్దూ హు ఉహు ఉహు—

(శృతిమించి)

“గుమ్మిడికాయ కూర నా కొద్దే—ఏ-ఏ-ఏ-

(బొరుమని రాగం)

ఆఫీసునుంచి తండ్రి ఇంటికి వచ్చి పొట్టి కుంచమల్లే దొర్లుతోన్న దుర్గి రాగాలు విని ఎత్తుకొని “ఏమర్రా దుర్గికి వద్దంటోంటే గుమ్మిడికాయ కూర ఎందుకేశా ర్రా? అది ఏడుస్తోంది” అని మావారు ప్రథమకోపం చూపించారుగాని అంతలో ఆ యేడుపుయొక్క అసలు అర్థం బోధపడి దుర్గిచేతిలో ఒక కొన్ని డబ్బులు పెట్టగానే అతి బాల్యమునుంచి డబ్బుయొక్క విలువ ఎరిగిన ఆ బిడ్డ వెంటనే ఊరుకొని కూర సంగతి మఱచి హాయిగా నిద్రబోయెను. లేకుంటే గాడిద కూసిందాకా ఏడుపు వదలకపోను. ఆ వేళ గుమ్మిడికాయ కూర దుర్గికి పెట్టకుండా మేము తినవలసి వచ్చింది—రామ రామా.


## ప్రకటన రేట్లు

| | | | |
|---|---|---|---|
| ఒకసారికి | 1 పుటకు | రూ. | 30—0—0 |
| ,, | ½ పుటకు | రూ. | 15—0—0 |
| ,, | ¼ పుటకు | రూ. | 7—8—0 |
| సం॥ చందా | | రూ. | 1—0—0 |
| విడి ప్రతి | | అణాలు | 0—2—0 |

వివరములకు :— “వినోదిని” కార్యాలయము,

234, గోవిందప్పనాయక్ వీధి, జి. టి., మద్రాసు.